www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 17 ఫిబ్రవరి 2024





వేడుకగా రథోత్సవం

జనంతో కిక్కిరిసిన దేవునికడప

ప్రజాశక్తి - కడప అర్బన్

తిరుమల తొలిగడపగా ప్రసిద్ధిగాంచిన దేవుని కడప శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి రథోత్సవ వేడుకలు వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన అఖిలాండ నాయకుడు కడప రాయుడు కొలువు దీరిన రథాన్ని భక్తులు పోటీపడి ఊరేగించారు. రథోత్సవం కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. దేవుని కడప బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం కిక్కిరిసిన జనసంద్రం నడుమన శ్రీవారి రథోత్సవం రంగరంగ వైభోగంగా ప్రారంభమైంది. తొలుత టెం కాయ కొట్టి రథోత్సవాన్ని ముందుకు సాగించారు. తేరుపై గంభీరముద్ర సుందర స్వరూ పులైన ఉత్సవమూర్తులను ప్రజలు తనివితీరా తిలకించి పులకించిపోయారు. రథం ముందుకు సాగుతుండగా భక్తులు గుమ్మడి కాయలు రథచక్రాల కింద ఉంచి మొక్కలు తీర్చు కున్నారు. దేవునికడపలో ఘనంగా రథ ఊరేగింపు అనంతరం శ్రీవారి తేరు తిరిగి తన నిజస్థానంలో నిలిచింది. **కడప రాయుడి సన్నిధిలో ఉప ముఖ్యమంత్రి..** దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్ బి అంజాద్ భాష సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. పండుగలు, ఉత్సవాలు మన సంస్కృతి సంప్రదాయాలను నలుదిక్కులా పరిమళింపజేస్తాయని పేర్కొన్నారు.

రాయచోటి : నిరసన తెలుపుతున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు



గ్రామీణ బంద్ ప్రశాంతం

- వెల్లువెత్తిన ర్యాలీలు, నిరసనలు
- కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు మూసివేత
- రైతు, కార్మిక, వ్యవసాయ కార్మికుల సమరభేరి
- బిజెపిని గద్దె దించేందుకు అన్ని వర్గాల ప్రజలు ఏకం కావాలి
- వామపక్ష, కార్మిక, రైతు సంఘాల నాయకుల పిలుపు

గ్రామీణ బంద్ ప్రశాంతంగా ముగిసింది. కడప, అన్నమయ్య జిల్లాల్లోని వామపక్ష రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలతో కలిసి సిఐటియు, ఎఐటియుసి, కాంగ్రెస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు సంయుక్తంగా పెద్దఎత్తున ఉద్యమించారు. కేంద్రంలోని బిజెపి సర్కారు తెచ్చిన మూడు నిరంకుశ వ్యవసాయ నల్లచట్టాలను రద్దు చేయాలని కోరుతూ దేశ రాజధాని ఢిల్లీలో రైతులు పెద్దఎత్తున చేపట్టిన ఉద్యమానికి సంఘీభావంగా చేపట్టిన గ్రామీణ బంద్ జయప్రదమైంది. ఉమ్మడి జిల్లాలోని కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, మదనపల్లి, తంబళ్లపల్లి అసెంబ్లీ కేంద్రాల్లోని సుమారు 66 మండలాల గ్రామీణ ప్రాంతాల్లో నిరసనలు, భారీ ర్యాలీలు నిర్వహించారు. పోస్టాఫీసులు, బిఎస్ఎన్ఎల్, అంగన్వాడీ కేంద్రాల్లో వినతిపత్రాలను అందజేశారు.



రైల్వేకోడూరు : ఎపిఎండిసిలో నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/యంత్రాంగం

గ్రామీణ బంద్ ప్రశాంతంగా ముగిసింది. కడప, అన్నమయ్య జిల్లాల్లోని వామపక్ష రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలతో కలిసి సిఐటియు, ఎఐటియుసి, కాంగ్రెస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు సంయుక్తంగా పెద్దఎత్తున ఉద్యమించారు. కేంద్రంలోని బిజెపి సర్కారు తెచ్చిన మూడు నిరంకుశ వ్యవసాయ నల్లచట్టాలను రద్దు చేయాలని కోరుతూ దేశ రాజధాని ఢిల్లీలో రైతులు పెద్దఎత్తున చేపట్టిన ఉద్యమానికి సంఘీభావంగా చేపట్టిన గ్రామీణ బంద్ జయప్రదమైంది. ఉమ్మడి జిల్లాలోని కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, మదనపల్లి, తంబళ్లపల్లి అసెంబ్లీ కేంద్రాల్లోని సుమారు 66 మండలాల గ్రామీణ ప్రాంతాల్లో నిరసనలు, భారీ ర్యాలీలు నిర్వహించారు. పోస్టాఫీసులు, బిఎస్ఎన్ఎల్, అంగన్వాడీ కేంద్రాల్లో వినతిపత్రాలను అందజేశారు. **రాయచోటి టౌన్ :** సంయుక్త కిసాన్ మోర్చాలోని రైతు కార్మిక సంఘాలు, ఉమ్మడిగా ఇచ్చిన దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా రాయచోటిలో వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తూ తర్వాత ర్యాలీ చేపట్టి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మానవహారం నిర్మించడంతో గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. అనంతరం పోస్టాఫీసు, ఎల్ఐసి, ఎస్బిఐలను సిఐటియు, రైతు సంఘాల నేతలు మూయించి వేయడంతో పలు సేవలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.రామచంద్ర, రంగారెడ్డి, గిరిజన సంఘం నాయకులు విశ్వనాథ్ నాయక్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కృష్ణప్ప, సిఐటియు ఉపాధ్యక్షులు ఎవి.రమణ మాట్లాడుతూ కార్మికులకు ఆసరాగా ఉండే 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, యజమానులకు కార్పొరేట్ లాభాలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లు తీసుకువచ్చి కార్మికులను నయా బానిసలుగా మార్చాడని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం రైతాంగ పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలన్నారు. కౌలు రైతులకు పంట రుణాలు, పంట నష్టపరిహారం భూ యజమానితో సంబంధం లేకుండా ఇవ్వాలని తెలిపారు. ఏ పని చేసే కార్మికుడికైనా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ రాయచోటి ప్రాజెక్టు అధ్యక్షులు సిద్ధమ్మ, నాగమణి, సబీనా, సరస్వతి, భూదేవి, మున్సిపల్ నాయకులు రాంబాబు, చెన్నయ్య, హమాలీ నాయకుతు జి.మాధవయ్య పంచాయతీ కార్మికుల స్వచ్ఛ భారత కార్మికుల అధ్యక్షులు ఎం.శేఖర్ నాయక్, ఎఐటియుసి నాయకులు శ్రీనివాసులు, హుస్సేన్ పాల్గొన్నారు. **మదనపల్లి :** నిరంకుశత్వంగా కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. పట్టణంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో, సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు తలపెట్టిన రైతాంగ, పారిశ్రామిక కార్మిక బంద్ సందర్భంగా నిరసనలు వెల్లువెత్తాయి. పట్టణంలోని బ్యాంకులు, బిఎస్ఎన్ఎల్ కార్యాలయం, హెడ్ పోస్ట్ ఆఫీసు మూత వేయించి బంద్ చేపించారు. పట్టణంలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం ముందు బెంగళూరు రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. ఐసిడిఎస్ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరిన అంగన్వాడీలు చిత్తూరు బస్టాండ్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి పర్మినెంటు చెయ్యాలని, ఉపాధి హామీ పని దినాలు పెంచాలని, కూలీ 600 రూపాయలు ఇవ్వాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఆందోళన చేస్తున్న, రైతులు, కార్మికులపై దేశ సరిహద్దులో రణరంగం మాదిరిగా నరేంద్ర మోడీ ప్రభుత్వం రబ్బర్ బుల్లెట్ గుల్ల వర్షం కురిపిస్తూ, బాష్ప వాయువు ప్రయోగిస్తూ, రైతులను, కార్మికులను నిర్బంధిస్తుందని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా, కార్మికులకు కనీస వేతన చట్ట ప్రకారం వేతనాలు ఇవ్వకుండా , కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తూ ప్రభుత్వం అచ్చేదీన్ అని భీరాలు పలుకుతుందని పేర్కొన్నారు. దుర్మార్గపు బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కార్మికులు, కర్షకులు ఐక్యంగా కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం మండల నాయకులు పవన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుధాకర్, సిఐటియు నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నారాయణ, ఖదీర్ అహ్మద్, రాజశేఖర్, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.రాజేశ్వరి, నాయకులు మధురవాణి, గంగాదేవి, విజయ, పంచాయతీ వర్కర్ల సంఘం నాయకులు గోపాల్, ఐటియుసి నాయకులు కృష్ణమూర్తి పాల్గొన్నారు. **పెనగలూరు :** ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల వద్ద సిఐటియు మండల కార్యదర్శి మద్దెల ప్రసాద్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు, విఆర్ఎలు నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు చింతలపల్లి నందకుమార్, కోటి నరసయ్య రామకృష్ణయ్య, ఉమా, చంద్రకళ, శిరీష, సుజాత, గంగాద్రి, రాధ, భాను పాల్గొన్నారు. **సంబేపల్లె (రాయచోటి) :**ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిరిపురి రామచంద్ర ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు జి.భాస్కర్‌రెడ్డి, సిఐటియు నాయకులు అనసూయమ్మ, శ్రీలత, ఫర్హానా, చాందినీ, వెంకట సుబ్బమ్మ, జయలక్ష్మి పాల్గొన్నారు. **పుల్లంపేట:** ఓబులవారిపల్లి ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఎస్‌బిఐ వరకు ర్యాలీగా వెళ్లి తమశీల్దార్ కార్యాలయం దగ్గర నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జయరామయ్య, నాయకులు హరిప్రసాద్, బి.కేశవులు, వెంకట్‌రెడ్డి, దుర్గ, సుభద్ర, లక్ష్మీదేవి, చెన్నకేశవులు, కాంగ్రెస్ నాయకులు బొమ్మి సంగయ్య, మహిళ సమైక్య మండల కార్యదర్శి మడగలం రోజమ్మ, చింతలపూడి నాగమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి హజీమ పాల్గొన్నారు. **రైల్వేకోడూరు:** స్థానిక గాంధీ విగ్రహం వద్ద, సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, సిఐటియు మండల అధ్యక్షులు పుల్లయ్య, ఉపాధ్యక్షులు లింగాల యానాదయ్య, కోశాధికారి, హరి నారాయణ, విద్యుత్ కార్మిక నాయకులు కిరణ్ కుమార్, అంకయ్య, సుబ్బరాయుడు, జోగినేనీ మనీ, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు కోశాధికారి పద్మ, మండల నాయకులు వెన్నెల, జైకుమారి, పిడుగు శోభ, మణెమ్మ, రత్న, జ్యోతి, విఆర్ఎ సంఘం నాయకులు, లక్ష్మీకర్, కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘ నాయకులు, తుపాకుల హరిప్రసాద్,ఆటో యూనియన్ నాయకులు, సుబ్బరాయుడు, సుబ్బరామయ్య, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్, ఓబిలి పెంచలయ్య,వ్యవసాయ కార్మిక సంఘం, మండల నాయకులు, బొజ్జ శివయ్య పాల్గొన్నారు. **మంగంపేట ఎపిఎండిసిలో...:** జెఎసి పోరాట కమిటీ కన్వీనర్ ఆర్.వెంకటేష్, నాయకత్వంలో ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్, సిఐటియు అనుబంధం, ఎపిఎంసి వర్కర్స్ యూనియన్, మంగంపేట మైనింగ్ వర్కర్స్ యూనియన్, త్రివేణి, ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. డిస్పాచ్, తోలకాలు, స్వచ్ఛందంగా నిలిపివేసి, ట్రాన్స్‌పోర్టు రంగం, లారీ, డ్రైవర్లు దాదాపు 300 మంది సంఘీభావంగా పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సిపిఎం, సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్అండ్ బి బంగ్లా నుంచి పాత బస్టాండ్ మీదుగా బైపాస్ రోడ్డులోని ఎన్టీఆర్ కూడలి వరక ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు చిట్వేలి రవికుమార్, గాలి చంద్ర, రాయుడు, మహేష్, శివరామకృష్ణ, సికిందర్, నాగేశ్వరరావు, మున్నా, రమణ, చంద్ర, రవి, విజయ, శివరంజని, శంకరయ్య, నరసింహ పాల్గొన్నారు.


మదనపల్లె : ఎస్‌బిఐని మూయిస్తున్న నాయకులు


రాజంపేట : నిరసన తెలుపుతున్న నాయకులు


పెనగలూరు : నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు, విఆర్‌ఎలు

'ఉపాధి' పనులను విస్తృతంగా కల్పించాలి'

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఉపాధి హామీ పను లను విస్తృతంగా కల్పించాలని, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని త్వరితగతిన పూర్తి చేయా లని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి రెవెన్యూ, రీసర్వే మూడవ దశ, ఇనామ్, అసైన్డ్ భూములు, మూడవ దశ రీసర్వే, ఉపాధి హామీ, కరువు మండలాల్లో వేతన ఉత్పత్తి, తాగునీరు సరఫరా, వైద్య ఆరోగ్యం కుటుంబ సంక్షేమం లో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశ క్యాంపుల నిర్వహణ, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణ విసి ద్వారా పాల్గొన్నారు. విసి అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశ కార్యక్ర మాలను మరింత పటిష్టవంతంగా నిర్వహించి ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ఒపి సంఖ్యను పెంచా లన్నారు. ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు చేసి అవస రమైన వారిని ఆరోగ్యశ్రీ కింద రెకమెండ్ చేయా లన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వాడాల్సిన మందుల వివరాలను జగనన్న ఆరోగ్య సురక్ష క్రింద ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తే సదరు వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వమే ఉచితంగా మందులను నేరుగా ఇంటికి పంపుతుందని ఈ విషయంపై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కంటి వెలుగు పథకంలో భాగంగా రెఫరల్ చేయబడిన వారికి అద్దాల పంపిణీ వందశాతం పూర్తి చేయాలన్నారు. నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని, జిల్లాలో టాస్క్ ఫోర్స్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. రెవెన్యూ అంశంలో భాగంగా చుక్కల భూములు, ఇనాం భూ ములను మార్గదర్శకాల మేరకు పరిష్కరిం చాల న్నారు. ఈ అంశంలో పెండింగ్ పనిని త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో మూడవ దశ రీ సర్వేలో 20 వేల పైగా ఎకరాలు సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇల్లు అంశంలో భాగంగా ప్రతి సచివా లయంలో రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. పంచాయతీ సెక్రెటరీలు రిజిస్ట్రేషన్ పటిష్టంగా నిర్వహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరా అంశంపై సిపిడబ్ల్యూ పథకం అమలలో ఎటువంటి లోటు పాట్లు ఉండరాదని వ్యవస్థను పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఆయా శాఖలు ప్రభుత్వ పథకాల అమలులో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి-రాయచోటి

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధంగా ఉండా లని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లను, ఎస్పీలను ఆదేశిం చారు. శుక్రవారం సాయంత్రం మీనా సార్వత్రిక ఎన్నికలు-2024కు సంసిద్ధతపై విసి ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాకు సంబంధించి ఫారం 6, 7, 8 తదితర ఫారంలలో ఏవైనా పెండింగ్లో ఉంటే వాటిపై త్వరగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల విధులకు కేటాయిం చిన అధికారులకు తగిన శిక్షణ ఇవ్వాలని, పోలింగ్ కేంద్రాలలో అవసరమైన సౌకర్యాలను ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే లోపల కీలకమైన ప్రదేశాలలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసుకొని ఎన్ని కలలో మద్యం నగదులను అరికట్టాలన్నారు. ఎన్ని కలకు కేటాయించబడిన పోలీస్ అధికారులకు తగిన శిక్షణ ఇవ్వాలని, ఎన్నికలకు తగినంత సిబ్బం ది ఉండేలా చూసుకోవాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ నోడల్ అధికారులు ఎన్నికల ప్రక్రియకు పూర్తి స్థాయిలో సన్నద్ధం అవ్వాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్పి కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అడిషనల్ ఎస్పీ రాజకమల్, డిఆర్ఒ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 29 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-రాయచోటి

శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రాంగణ ఎంపికల్లో అత్యుత్తమ ప్రతిభ చూపారని శ్రీసాయి విద్యా సంస్థల కరస్పాండెంట్ కె.పి.వి.సుబ్బయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బహుళజాతి సంస్థ అయిన కోయాప్స్ సంస్థ నిర్వ హించిన ఎంపికలలో ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం నుండి 23 మంది విద్యా ర్థులు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం నుండి 6 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పేర్కొ న్నారు. 23 సంవత్సరాల నుండి కళాశాలలో విద్యను అభ్యసించిన ఎంతోమంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు, సాఫ్ట్వేర్, వివిధ శాస్త్ర, సాంకేతిక, పరిశోధన సంస్థలలో దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని వివరించారు. విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ గురువారం సంస్థ ప్రతినిధులు రెండు దశలలో టెక్నికల్ వ్రాత పరీక్ష, మౌలిక ఇంటర్వ్యూ నిర్వహించి విద్యార్థులను సాఫ్ట్వేర్ డెవలప్మెంట్ ఇంజనీర్లు గా ఎంపిక చేసుకున్నారని వివరించారు.ఎంపికైన విద్యార్థులకు రూ.4.2 లక్షల వార్షిక వేతనం, ఇతర అలవెన్సులు ఉంటా యని తెలియజేశారు. కళాశాలలో ప్రతి విద్యార్థికి ఉద్యోగ అవకాశం కల్పించడమే ధ్యేయంగా కళాశాలలో మౌలిక వసతులు కల్పించి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజి, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి సుభహాన్, ఇసిఇ విభాగాధిపతి కార్తికేయన్, అధ్యాపకులు అభినందించారు.

చిత్రకారుడు నాయిని గిరిధర్‌కు సత్కారం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

హైదరాబాద్ నగరంలో సాలార్ జంగ్ మ్యూజియంలో మాస్టర్ స్ట్రోక్-3 గ్రూపు షో పేరిట అంజి అకొండి క్రియేటివ్ హార్ట్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక చిత్ర కళా ప్రదర్శనలో రాజంపేటకు చెందిన ప్రముఖ చిత్రకారుడు నాయిని గిరిధర్ చిత్రాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 53 మంది చిత్రకారుల 70 కళా ఖండాలు ఈ షోలో ప్రదర్శించగా గిరిధర్ చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ నెల 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు కొనసాగిన ఈ ప్రదర్శనలకు ఆంధ్రప్రదేశ్ క్రిఐటివిటీ కల్చరల్ కమిషన్ కార్యదర్శి జోగినాయుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత రమణారెడ్డి, నీవె వరు, లవర్స్ చిత్రాల దర్శకుడు హరినాథ్, పుష్ప సినిమా లుక్స్ డిజైనర్ ఎం.లక్ష్మీ నారాయణ చిత్రకళా ప్రదర్శనను ఎంతో ఆసక్తిగా వీక్షించారు. తెలుగు రాష్ట్రాల లోని వివిధ ప్రాంతాల నుంచి వివిధ కళారూపాలు ఈ ప్రదర్శనలో ఆకట్టుకున్నాయి. ప్రత్యేకించి నాయిని గిరిధర్ కుంచె నుంచి జాలువారిన పాల పాత్రలతో బిడియం, అమాయకత్వం కలగలిపి నిలిచున్న గ్రామీణ బాలిక చిత్రం, భుజాల మీద చేతులు వేసుకొని స్నేహభావాన్ని ప్రకటిస్తున్న బాలికల చిత్రాలు మ్యూజియంకు విచ్చేసిన వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఏది ఏమైనా రెండు తెలుగు రాష్ట్రాలలో రాజంపేటకు చెందిన కళాకారుడు గిరిధర్‌తో పాటు ఆయన చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ప్రశంసలు, నిర్వాహకుల నుంచి సత్కారం అందుకోవడం ఆంధ్ర రాష్ట్రానికే గర్వకారణమని రాజంపేట వాసులు మురిసిపోతున్నారు.


సత్కారం అందుకుంటున్న నాయిని గిరిధర్

ఒపిఎస్ అమలు చేసేవారికే మద్దతు : యుటిఎఫ్

ప్రజాశక్తి-మదనపల్లి

ఒపిఎస్ అమలు చేసేవారికే తమ మద్దతు ఉంటుందని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ అన్నారు. పాత పెన్షన్ విధానం సాధన కోసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని విస్తృతం చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం 'మన ఓటు మన భవిష్యత్తు 'అనే నినాదంతో కూడిన పోస్టర్లు విడుదల చేసి అనంతరం పలు పాఠశాలలు, ముఖ్య ప్రదేశాల్లో అంటించారు. సిపిఎస్ జిపిఎస్ కాకుండా ఒపిఎస్ మాత్రమే అమలు చేసేందుకు సిద్ధంగా ఉంటామని మ్యానిఫెస్టోలో ప్రకటిస్తూ తొలి సంతకం చేసే వారికే రానున్న ఎన్నికల్లో ఉద్యోగ ఉపాధ్యాయ నిరుద్యోగుల ఓట్లు అనే నినాదం బలంగా ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రతి ఉద్యోగి, నిరుద్యోగ యువత ఓట్ ఫర్ ఒపిఎస్ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వ ఈ విషయంలో పలు మార్లు అనేక వేదికల మీద అమలు చేస్తామని చెప్పి 5 సంవత్సరాలు కాలయాపన చేసి నేడు మాట తప్పడం దారుణమన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ డివిజన్ కన్వీనర్ సుధాకర్ మదనపల్లి మండల, పట్టణ అధ్యక్షులు గాలి రవీంద్ర, భానుమూర్తి శీనప్ప, హరికృష్ణ, అంజప్ప, సురేంద్ర హస్సన్ భాష, జులాన్ బాష పాల్గొన్నారు.

ఆర్అండ్‌బిలో ఉద్యోగాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో రహదారులు, భవనముల శాఖ ఇన్స్పెక్షన్ బంగ్లాలలో 26 ఉద్యోగాలకు (వాచ్ మెన్-8 సానిటరీ వర్కర్స్-8, అటెండర్స్ 10) గాను దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆర్అండ్‌బి జిల్లా అధికారి సహదేవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. ఆసక్తి గలవారు దరఖాస్తులను annamayya.ap.gov.in వెబ్ సైట్ నుండి 19-02-24 ఉదయం 10 గంటల నుండి డౌన్లోడ్ చేసుకొనగలరునీ తెలిపారు. దరఖాస్తును 22-02-24 సాయంత్రం 5 గంటల లోపల ఆర్అండ్‌బి కార్యాలయంలో సమర్పించాలన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి : కమిషనర్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణంలో దోమల నివారణ కొరకు అన్ని పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ముఖ్యంగా నీరు నిలువ ఉండే ప్రాంతలలో దోమలు అధిక సంఖ్యలో ఉత్పత్తి అయ్యే అవకాశం ఉన్నందున అలాంటి ప్రాంతాలను గుర్తించి అక్కడ ఆయిల్ బాల్స్ వేయడం, స్ప్రే చేయడం వంటి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. వార్డు పరిధిలో ఎక్కడైనా అపరిశుభ్ర వాతావరణం ఉంటే వెంటనే సచివాలయ పర్యావరణ కార్యదర్శికి తెలియజేయాలని సూచించారు. ప్రజలు కూడా తమ ఇంటి ఆవరణం, కుండలు, నీటి తొట్లలో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకోరాదని సూచించారు. ప్రతి శుక్రవారం లిఫ్రైడే-డ్రైడేలి పాటించాలని కోరారు. వీరభద్ర స్వామి ఆలయం, మార్కెట్ వద్ద జరుగుతున్న స్ప్రెయింగ్ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, పర్యావరణ కార్యదర్శులు, రామ్మోహన్ రెడ్డి, శివరంజని పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి : సిఐ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని మైనర్లు వాహ నాలు నడిపితే అందుకు తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తిసుకుంటామని ట్రాఫిక్ సిఐ మహబూబ్‌బాష హెచ్చరించారు. నేతాజీ కూడలి వద్ద శుక్రవారం ట్రాఫిక్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేశారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలుతో పాటు లైసెన్స్ సరైన పత్రాలు లేని వారికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రతి ఒక్కరు లైసెన్స్‌తో పాటు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదన్నారు. అతివేగంతో పాటు రాష్ డ్రైవింగ్ చేయడం ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. పోలీసు, రవాణా శాఖ అధికారులు అనేక మార్లు రోడ్డు ప్రమాదాల అవగాహనా కార్య క్రమాలు కల్పిస్తున్నప్పటికీ వాహనదారుల అజాగ్రత్తతోనే ప్రమాదాలు బారిన పడుతున్నారన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి

పేదలకు వరం 'ఆరోగ్య సురక్ష' : ఎంపిపి

ప్రజాశక్తి-వీరబల్లి

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం లాంటిదని, పేద ప్రజలు వైద్యం కోసం ఇబ్బంది పడకుండా ఇంటి వద్దకే వైద్యాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపిడిఒ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సానిపాయి పంచాయతీలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశ మెడికల్ క్యాంపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపిపితో పాటు ఎంపిడిఒ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వైద్యులతో మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చిన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన మందులు అందజేయాలని సూచించారు. కార్పొరేట్ వైద్యానికి ధీటుగా పేదలకు మెరుగైన వైద్యం అందించడం ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు బిపి, షుగర్, రక్తపరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి మందులు , కంటి అద్దాలు అందించినట్లు డాక్టర్ జియాఉల్లా తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నేతి ఆంజనేయులు, స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ రాజాఅహ్మద్, డాక్టర్ యుగంధర్‌రెడ్డి, జనరల్ మెడిసిన్ స్పెషలిస్ట్ కంటి వైద్యులు విజయ్‌కుమార్‌నాయక్, పంచాయతీ సెక్రటరీ బాలస్వామి, సిహెచ్ఒ సుధాకర్, పిహెచ్ఎం గంగమ్మ, సూపర్వైజర్లు శివయ్య, సరోజమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ కల్పన, మెడికల్ క్యాంపస్ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు. అనంతరం ఎంపిపి, ఎంపిడిఒలు జడ్‌పి ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్నం భోజనాన్ని పరిశీ లించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని రంగంపల్లె గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం డాక్టర్ సానేశేఖర్, డాక్టర్ మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో రెండవ విడత జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల్లో కొన్ని వేల వైద్య శిబిరాలు నిర్వహించి పేద బడుగు బలహీన వర్గాలకు మెరుగైన వైద్యం అందిస్తుందని తెలిపారు. అవ్వ తాతలకు వైద్యులు స్వయంగా ఇంటి దగ్గరికి వెళ్లి పరీక్షించి మందులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వాలంటీర్లకు పురస్కారాలు

ప్రజాశక్తి-రామాపురం

గ్రామాలలో ఉత్తమ సేవలు అందించిన వాలంటీర్లకు ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్మానం పురస్కారాలు అందజేస్తున్నట్లు ఎంపిడిఒ ప్రభాకర్ తెలిపారు. మండలంలోని పప్పిరెడ్డిగారిపల్లె సచివాలయ పరిధిలో యువరాజు, చిట్లూరు సచివాలయ పరిధిలో రమేష్‌బాబు, సూర్యనారాయణ పురం సచివాలయ పరిధిలో శరత్‌బాబు, సరస్వతిపల్లి సచివాలయ పరిధిలో స్వాతి, కుమ్మర పల్లిలో అబ్బు సుహానీలకు 'సేవా రత్న' పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు.

సిద్ధం సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-రామాపురం

అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగే సిద్ధం సభను విజయవంతం చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జెడ్‌పిటిసి వెంకటరమణ, ఎంపిపి జనార్దన్‌రెడ్డిలు తెలిపారు. స్థానిక ఎంపిపి కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 13 గ్రామాల్లోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు పెద్దిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, సర్పంచ్ నాగభూషణ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీధర్‌రెడ్డి, ఆదిరెడ్డి, శివయ్య పాల్గొన్నారు.

సుంకర శ్రీనివాస్‌ను కలిసిన 'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



సుంకర శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న శ్రీనివాసరాజు

కడప నగరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆపార్టీ జిల్లా సమన్వయ కమిటీ సుంకర శ్రీనివాస్ రాజంపేట జనసేన నాయకులు యల్లటూరు శ్రీనివాస రాజు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. సుంకర శ్రీనివాస్ వెల్లటూరును సాదరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం భవిష్యత్తు కార్యాచరణపై ఇరువురు చర్చించుకున్నారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి యల్లటూరు శివరామరాజు, జనసేన నాయకులు కడిమెళ్ల శ్రీనివాసరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, చింతల రామకృష్ణ పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడుతో 'మండిపల్లి'...

ప్రజాశక్తి- రాయచోటి



రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడును విజయవాడలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సన్మానించినట్లు నియోజకవర్గ టిడిపి నాయకులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ విజయావకాశాలకు కృషి చేయాలని సూచించినట్లు ఆయన తెలిపారు.

పవన్‌కళ్యాణ్‌తో కొండా నరేంద్ర...

ప్రజాశక్తి-బి.కొత్తకోట

జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌ను నియోజకవర్గానికి చెందిన టిడిపి నాయకులు, పారిశ్రామికవేత్త కొండ నరేంద్ర శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తంబళ్లపల్లి నియోజకవర్గపు ప్రస్తుత రాజకీయ పరిస్థితుల గురించి చర్చించుకున్నారు. ఈ సందర్భంగా కొండా నరేంద్ర మాట్లాడుతూ తంబళ్లపల్లి నియోజకవర్గం జనసేన,టిడిపి ఉమ్మడి అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని పవన్‌ను కోరినట్లు తెలిపారు. ప్రజా సేవే లక్ష్యంగా తాను రాజకీయాలకు వచ్చానని తాను పుట్టిన నియోజకవర్గం ప్రజలకు మంచి చేయాలన్నదే తన సంకల్పమని చెప్పారు. పవన్ కళ్యాణ్ ఎంతో హుందాతనం కలిగిన రాజకీయ నాయకుడిని కితాబునిచ్చారు. తనకు ఉమ్మడి అభ్యర్థిగా అవకాశం కల్పిస్తే విజయం సాధించి నియోజకవర్గం రూపురేఖలు మారుస్తానని స్పష్టం చేశారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట : ఎంపీ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మహిళా సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన నాలుగవ విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లా డారు. పాదయాత్రలో సిఎం జగన్ ఇచ్చి హామీల్లో భాగంగా డ్వాక్రా మహిళలకు రుణమాఫీ సంబంధించి నగదును మహిళల ఖాతాల్లో జమ చేశారని అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తుంటే ప్రతి పక్షాలు అనవసర రాద్ధాంతాలు చేస్తున్నాయని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. అనంతరం రైల్వే కోడూరులో 50 పడకల ఆస్పత్రితో పాటు పలు గ్రామ సచి వాలయాలు, విలేజ్ క్లినిక్‌లు, వెల్నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలను ఎంపీ ప్రారంభించారు. కార్యక్ర మంలో సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మం డలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, ఆర్‌డిఒ మోహన్‌రావు, వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ హేమనవర్మ, ఎపిటూ రిజం డైరెక్టర్ మందల నాగేంద్ర, ఉప సర్పంచ్ తోటశివసాయి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ముజీబ్, గునిశెట్టి ప్రశాంతి, జడ్‌పిటిసి రత్నమ్మ, బిఎల్ నరసింహారెడ్డి, ఎల్‌వి మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపి టిసిలు, స్వయం సహాయక మహిళలు పాల్గొన్నారు. **కలికిరి:** వైఎస్ఆర్ ఆసరాతో మహిళలకు ఆర్థిక పురోభివృద్ధి జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వెల్లడించారు. స్థానిక మండల కేంద్రంలోని ఎంపీ యుపి టీలు పాఠశాలలో వైయస్ఆర్ ఆసరా నాలుగో విడత మెగా చెక్కును మహిళలకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు ఇచ్చిన మాట తప్పకుండా రుణమాఫీ చేస్తానని మాట ప్రకారం మాట నిలబెట్టుకున్నారని అన్నారు. అనంతరం ఆరుగురు వాలంటీర్లకు సేవ పత్రాలు అందించి వారికి ఒక్కొకరికి రూ.45వేలు, ఐదుగురికి రూ.30వేలు నగదు పురస్కారం అందించారు. మండలంలోని ప్రతి వాలంటీర్లకు ప్రశంస పత్రం,దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామకృష్ణ, మండల కన్వీనర్ చింతల రమేష్ రెడ్డి, ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, జడ్‌పిటిసి వడ్డెజ లోకవర్ధన్ పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేరుస్తూ, డ్వాక్రా మహిళల రుణాలను మాఫీ చేయడమే గాక, సున్నా వడ్డీని అందిస్తూ, మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీని నాలుగు విడతల్లో వేయడంతో, మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామంటున్నారన్నారు. మండలంలోని 940 సంఘాలకు రూ.10.22 కోట్లు రుణమాఫీ చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సుధాకర్‌రెడ్డి, ఎపిఎం నరసింహులు, సర్పంచ్ గంగులమ్మ, నాయకులు చింతల ఆనంద రెడ్డి, శివానంద రెడ్డి, కేశవ రెడ్డి, అబ్దుల్ కలీం, మహబూబ్‌బాషా, రాయుడు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మహిళలు, వలంటీర్లు పాల్గొన్నారు.



మహిళలకు మెగా చెక్కును అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే



వాల్మీకిపురం : చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల

నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి : ఎస్ఇ



రామాపురం : విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఇ రమణ

ప్రజాశక్తి-రామాపురం

ప్రజలకు నాణ్యమైన విద్యుత్తును అందించడమే ప్రధాన ఉద్దేశమని విద్యుత్ శాఖ ఎస్ఇ రమణ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన రామాపురంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. అనంతరం రామాపురం భవనం శాఖ అతిథి గృహంలో విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఇ మాట్లాడుతూ ప్రస్తుతం వేసవికాలం సమీపిస్తుండటంతో ట్రాన్స్‌ఫార్మర్లను పర్యవేక్షించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల, పగటి వేళల్లో విద్యుత్ దీపాలు ఎక్కడ వెలగకుండా చూడాలని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులకు అందించాల్సిన విద్యుత్తును సకాలంలో అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఇ చంద్రశేఖర్ రెడ్డి, ఎడిఎ విజయకుమార్ రెడ్డి, రామాపురం ఎఇ వరప్రసాద్‌రెడ్డి, వీరబల్లి ఎఇ రమేష్‌బాబు, లక్కిరెడ్డిపల్లి ఎఇ హరిప్రసాద్, లైన్‌మేన్‌లు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌లో తనిఖీ

వీరబల్లి : మండలంలోని వీరబల్లి, ఉప్పరపల్లి, మట్లి, విద్యుత్ సబ్ స్టేషన్లను విద్యుత్ శాఖ ఎస్ఇ రమణ శుక్రవారం తనిఖీ చేశారు. విద్యుత్ సంబంధిత రికార్డులను, విద్యుత్ యూనిట్ల వాడకాన్ని పరిశీలించారు. వ్యవసాయ రైతుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. 9గంటల పూర్తి విద్యుత్ ఇవ్వాలని సూచించారు. లోవోల్టేజీ సమస్య లేకుండా గ్రామాల్లో విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యుత్ సంబంధించిన ఫిర్యాదులను వస్తే తక్షణమే పరిష్కరించాలని చెప్పారు. ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి ఎస్ఇని మర్యాదపూర్వకంగా కలిశారు. వేసవి కాలంలో విద్యార్థులు, రైతులు, విద్యుత్‌తో ఇబ్బంది పడకుండా నిరంతరాయంగా సరఫరా ఉండాలని ఎస్ఇని కోరారు. తనిఖీల్లో డిఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఎడిఇ విజయ్‌కుమార్‌రెడ్డి, ఎఇ రమేష్‌బాబు, సబ్ ఇంజనీర్ కేశవ, లైన్‌ఇన్‌స్పెక్టర్ రెడ్డయ్య, సిబ్బంది ఉన్నారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం : డాక్టర్ శివప్రతాప్

ప్రజాశక్తి-పీలేరు

వ్యాధుల్లేని కుటుంబాలు, విద్యార్థులు సమాజంలో మెరుగైన ఫలితాలు సాధిస్తారని రాష్ట్రీయ బాలల సురక్ష కార్యక్రమ అమలు జిల్లా అధికారి డాక్టర్ శివప్రతాప్ తెలిపారు. శుక్రవారం ఆయన పీలేరు పట్టణంలోని కోటపల్లె జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి బాలికల ఆరోగ్యస్థితి, ఆరోగ్య సేవల అందుబాటుపై ఆరా తీశారు. మాప్-అప్‌లో భాగంగా 370 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ 400 యంజి మాత్రలు పంపిణీ వంద శాతం పూర్తి చేసిన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.కార్యక్రమంలో తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్, హెచ్ఈ కొండయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎం భార్గవి, వెంకటరత్నం, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.**కలకడ :**నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వాడాలని వైద్యాధికారి యంవి.కిషోర్‌కుమార్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. మండలంలోని కలకడ, ఎర్రకోటపల్లి పిహెచ్‌సిలలో జాతీయ నులిపురుగు నివారణ కార్యక్రమంలో భాగంగా మాప్-అప్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల, మోడల్‌స్కూల్. కలకడ, కొత్తపల్లి, కదిరాయచెరువుచ బొంతలవారిపల్లి, వడ్డిపల్లిలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రతి స్కూల్, ప్రధానో పాధ్యాయులు అంగన్వాడీలను అడిగి నూరు శాతం ఆల్బెండజోల్ మింగిచారా లేదా అని అడిగి తెలుసు కున్నారు. కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 5120 మంది పిల్లలకు గాను 5120 మంది, ఎర్రకోట పల్లి పిహెచ్‌సిలో1371కి గాను 1371 ఆల్బెండజోల్ మాత్రలు మింగినట్లు వైద్యాధికారి తెలిపారు. కార్యక్ర మంలో వైద్యాధికారి సి.మల్లికార్జున,పాఠశాల ప్రిన్సిపల్ ఎ.అనిత, ఎంపిహెచ్ఇఒ జి.జయరామయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ వి.రాజమ్మ, ఆరోగ్య కార్యకర్త ఎల్.రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పిఎస్ లావణ్య, బి.కుమారి, అనురాధ, శారద పాల్గొన్నారు.



పీలేరు: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న జిల్లా అధికారి

వైభవంగా రథసప్తమి వేడుకలు

ప్రజాశక్తి-నందలూరు

ఉమ్మడి కడప జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీసౌమ్యనాథ స్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులు స్వామివారిని సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సౌమ్యనాథ స్వామి వారు ఉదయం కుర్మాలంకారంలో, సూర్యప్రభ వాహనంపై మాడ వీధుల్లో తిరుగుతూ భక్తులకు దర్శన మిచ్చారు. రాత్రి శ్రీకృష్ణ భగవానుని అలంకారంలో చంద్రప్రభ వాహనంపై శ్రీ సౌమ్యనాథ స్వామి వారిని మాడ వీధులలో ఊరేగించారు. **కలకడ:** రథసప్తమి వేడుకలను మండలంలో అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు.మండలంలోని కే దొడ్డిపల్లి పంచాయతీ గోపాలపురంలో వెలసిన శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాబా ఆలయ ఆవరణలో సూర్యదేవుని ప్రతిమను అంగరంగంగా వైభవంగా ఎర్రటి పూలు చిక్కుడు విత్తనాలతో అలంకరించారు.మహిళలు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. **పీలేరు:** సూర్య నమస్కారాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని షీ సంస్థ అధ్యక్షురాలు, యోగ థెరపిస్టు డాక్టర్ పివిఎస్ లక్ష్మి తెలిపారు. రథ సప్తమి సందర్భంగా పీలేరు పట్టణంలోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీభువన విద్యాలయం, విఎస్ఎన్ సిద్ధార్థ స్మార్ట్ కిడ్స్ క్యాంపస్‌లో నెహ్రూ యువ కేంద్రం, పీలేరు షీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు సామూహిక సూర్య నమస్కార పోటీలను నిర్వహించారు. కార్యక్రమాల్లో సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు, వారి సిబ్బంది, శ్రీభువన విద్యాలయం అధినేత్రి ఉమా రమాదేవి, ప్రిన్సిపాల్ గుణలక్ష్మీ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక ఆర్ఆర్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రశాంతంగా ప్రారంభమయాయి. కెజిబివి కళాశాల ఎంఎన్ఆర్ కాలేజ్ ఆర్ఆర్ కాలేజీలకు చెందిన 63 మంది విద్యార్థులు 16 నుంచి 19 తేదీ వరకు జరిగే ఇంటర్ ప్రాక్టికల్స్‌లో పాల్గొన్నట్లు ప్రిన్సిపల్ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మొదటి రోజు ఎంపిక చేసిన బ్యాచ్‌కు చెందిన విద్యార్థులందరూ ప్రాక్టికల్స్‌కు హాజరైనట్లు పేర్కొన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు రాసే విద్యార్థులు ఆందోళన చెందకుండా ప్రశాంత వాతావరణం కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులు మానసికంగా ప్రశాతంతతో ప్రాక్టికల్స్ పరీక్షలో పాల్గొన మంచి మార్కులుసాధించాలని సూచించారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం


ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రంలోని గాలివీడు బస్టాండ్ ఆవరణంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర హాస్పిటల్‌లో ఆదివారం ఉచితంగా షుగర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ప్రముఖ షుగర్ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ మిట్టపల్లి పుల్లారెడ్డి పేర్కొన్నారు. ఉచితంగా వైద్య శిబిరం నిర్మించడంతోపాటు ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు కూడా పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 40 సంవత్సరాలు దాటిన వారందరూ వచ్చి షుగర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. షుగర్ వ్యాధిగ్రస్తులు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్విని చేసుకోవాలని ఆయన సూచించారు.ప్రస్తుత ఆహారపు అలవాట్ల దృష్ట్యా ప్రతి ఒక్కరూ షుగర్ పరీక్షలు చేయించుకొని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సిఐ సూర్యనారాయణ పేర్కొన్నారు. నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్‌తో కలిసి పట్టణంలోని జ్యోతిచౌక్‌లో ట్రాఫిక్ సమస్యపై ఇరువురు చర్చించి పరిష్కారానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ట్రాఫిక్ సమస్య కొద్దిమేర తగ్గిందన్నారు. వాహనదారులు, పట్టణ ప్రజలు ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటిస్తే సమస్య సులభంగా పరిష్కారం అవుతుందని తెలిపారు. ద్విచక్ర వాహన దారులు, ఆటోలు నడిపేవారు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారన్నారు.ఇప్పటికే ట్రాఫిక్ సమస్యపై పలుమార్లు ప్రజలకు అవగాహన కల్పించామని అన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రజలు సహకారం అందించాలని కోరారు.



ట్రాఫిక్ సమస్యపై చర్చిస్తున్న కమిషనర్, సిఐ



ఎన్నికల ప్రచారంలో మేడా, ఆకేపాటి

ప్రచారం ప్రారంభించిన 'ఆకేపాటి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నియోజకవర్గం లో ఎన్నికల హడావుడి అప్పుడే మొదలైంది. జడ్‌పి చైర్మన్, వైసిపి అసెంబ్లీ అభ్యర్థి ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జున రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి తో కలిసి శుక్రవారం రాంనగర్‌లోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. గడపగడపకు వైఎస్ఆర్ నినాదంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ ప్రచారాన్ని కొనసాగించారు. రాబోయే ఎన్నికలలో జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడి తిరిగి రాష్ట్రంలో వైసిపిని అధికారంలోకి తీసుకురావాలని అన్నారు. పురపాలక పరిధిలోని సుమారు అన్ని వార్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆకేపాటి అనిల్ కుమార్ రెడ్డి, వైయస్ఆర్సీపీ పట్టణ కన్వీనర్ కృష్ణారావు యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోలి మురళిరెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు విష్ణు నాయక్, శివ, చలపతి, ధర్మయ్య, ఈశ్వరయ్య, శ్రీను యాదవ్, శ్రీను, విశ్వనాథరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆర్‌బికె సిబ్బందితో మాట్లాడుతున్న జెడి చంద్రనాయక్

పంటలకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి : రబీ సీజన్‌లో రైతులు ఏ పంట సాగుచేసినా ఆ పంటలకు ఇ-క్రాప్ తప్పనిసరిగా చేయించాలని జిల్లా వ్యవసాయ ఉపసంచాలకులు చంద్రనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రామాపురం, లక్కిరెడ్డిపల్లి, గాలివీడు, వీరబల్లి మండలాలకు చెందిన రైతు భరోసా సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటసాగు చేసిన ప్రతి రైతు ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని అన్నారు. పిఎం కిసాన్ పథకం కింద ప్రతి రైతుకు రూ.2వేలు తమ ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. ప్రతి రైతు నుంచి ఈనెల 21లోపు ఇ-బుకింగ్, ఇకెవైసి తప్పకుండా చేయించాలన్నారు.రైతుల నుంచి ఇకెవైసి విషయంలో క్షేత్రస్థాయి సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.రబీ,ఖరీఫ్ సీజన్లో పంట సాగు చేసిన రైతుల వివరాలు తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రాల్లో పొందు పరచాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో పని చేసే సిబ్బంది అర్హత కలిగిన రైతులను గుర్తించి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను,ఎరువులను సకాలంలో అందించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి సహాయ సంచాలకులు జయరాణి, ఎఒ రమేష్‌బాబురావు, ఎఇఒలు కరోలిన్, అనూష, ఎఇ.చాన్‌బాషా, నాలుగు మండలాల రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన

నందలూరు : మండలంలోని ఆడపూరు గ్రామపంచాయతీ పరిధిలో దిగువ దళితవాడలో శ్రీ సీతారాముల విగ్రహాలతో పాటు లక్ష్మణ, హనుమంతుల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక వైసిపి నాయకులు గడికోట వెంకటసుబ్బారెడ్డి, జడ్‌పిటిసి గడికోట ఉషారాణి దంపతుల సహకారంతో ఆలయ నిర్మాణానికి రూ.10లక్షలు విరాళాలన్ని అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నరసింహులు, రమణయ్య, పాల్గొన్నారు.

ఎన్నికల డిటిగా సుబ్రహ్మణ్యం

పీలేరు: మండల ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్‌గా సుబ్రమణ్యం నియమితులయ్యారు. శుక్రవారం ఈ మేరకు ఆయనకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పీలేరు మండలం డిప్యూటీ తహశీల్దారుగా పని చేస్తున్న సుబ్రమణ్యంను ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు కేటా యించారు. తన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులను నిర్వర్తిస్తానని తెలిపారు.

కలకడ తహశీల్దార్‌గా ప్రియదర్శిని

కలకడ : మండల కేంద్రమైన కలకడ తహశీల్దార్‌గా వి.ప్రియదర్శిని శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో నంద్యాల జిల్లా నంద్యాల ఆర్‌డిఒ కార్యా లయంలో అడ్మినేషన్ అధికారిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై కలకడ తహశీ ల్దార్‌గా వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తీర్చడానికి కృషి చేస్తారని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పుల్లేకుండా చొరవ తీసుకునేందుకు కార్యాలయ సిబ్బంది తనకు సహకరించాలని సూచించారు.

క్రైం కార్నర్

తోటపాలెంలో దొంగ హల్‌చల్

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవపల్లెలోని తోటపాలెంలో శుక్రవారం వేకువ జామున దొంగ చోరీ ప్రయత్నం చేసిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..భవన నిర్మాణ పనులు నిర్వహిస్తున్న మహబూబ్‌బాషా ఇంటిలోకి ఓ దొంగ చొరబడ్డాడని తెలిపారు. మహబూబ్‌బాషా కొడుకు అబ్దుల్లా వేకువ జామున రెండు గంటల 15 నిమిషాల సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి వరండాలోని మరుగుదొడ్డికి వచ్చి తిరిగి ఇంటి లోనికి వెళ్లే సమయంలో అలికిడి రావడంతో గమనించి అపరిచిత వ్యక్తి ఇంటి వరండాలో తారస పడడంతో గట్టిగా అరిచినట్లు తెలిపారు. తండ్రి మహబూబ్‌బాషా పరుగున బయటికి వచ్చి గుర్తు తెలియని వ్యక్తి తన కొడుకుతో కలబడడం చూసి అడ్డుకొనే ప్రయత్నం చేశాడని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తి కొడుకు,తండ్రి ఇద్దరినీ నెట్టి పారిపోయాడని పేర్కొన్నారు. ఈ పెనుగులాటలో దొంగ వెంట ఉన్న ఇనుప రాడ్డు, సెల్ ఫోన్, చెప్పులు సంఘటన స్థలిలోనే వదిలివెళ్లాడని తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్‌జహీర్ తెలిపారు.

మహిళపై పైశాచిక దాడి

-ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు

ప్రజాశక్తి-ములకలచెరువు

చింతకాయల కోసం వెళ్లిన దళిత మహిళను ఓ వ్యక్తి కర్రతో తీవ్రంగా కొట్టి గాయపరచిన ఘటన గురువారం ములకలచెరువు మండలంలో జరిగింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు ములకలచెరువు పోలీస్ స్టేషన్‌లో పోలీసులు ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేశారు. ఎఎస్ఐ నజీర్ తెలిపిన మేరకు.. మండలంలోని మద్దినాయునిపల్లి పంచాయతీ, రామిరెడ్డిగారిపల్లి దళిత కుటుంబానికి చెందిన వెంకటరమణ భార్య ధనలక్ష్మి దాసిరెడ్డిగారిపల్లెకు చెందిన తులసిరెడ్డి పొలంలోని చింతచెట్ల కింద శుక్రవారం గాలికి రాలిన చింత కాయలను ఏరుకోవడానికి వెళ్ళిందన్నారు. చింత చెట్టు కింద చింతకాయలు ఏరుతున్న మహిళపై తులసిరెడ్డి తన తోటలో కాయలు ఏరడానికి లేదని గొడవ పడ్డాడని, గాలికి రాలిన కాయలు ఏరుకుంటున్నానని చెప్పడంతో ఆగ్రహించి పక్కనే ఉన్న కర్రతో విక్షతణ రహితంగా ఆమెపై దాడి చేశాడని చెప్పారు. ఈ దాడిలో ఆమె చేయి విరిగి గాయపడినట్లు తెలిపారు. కుటుంబీకులు బాధితురాలని వెంటనే మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం జరిగిన ఘటనపై ములకలచెరువు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎఎస్ఐ నజీంబాషా నిందితుడు తులసి రెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.